## ఆటల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి, జూన్ 16 : ఆటల్లో గెలుపు ఓటములు సహజమని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..గెలుపు, ఓటమితో సంబంధం లేకుండా ఆటల్లో పాల్గొనడం ముఖ్యమని పేర్కొన్నారు. పోటీల్లో రెవెన్యూ టీం విన్నర్‌గా, మున్సిపల్ ఇంజినీరింగ్ టీం రన్నర్‌గా నిలిచాయి. వీరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, వంశీ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఉరుదొండ రవి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి, జూన్ 16: యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడానికి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన సోమర్యాగడి తండా, లింగంపేట జట్లకు ఆయన బహుమతలను అందజేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్సై మహేశ్‌తో పాటు క్రీడకారులు, యువకులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్వోసీ అందజేత

కామారెడ్డి, జూన్ 16 : కామారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ జహంగీర్ పాషా భార్య సమీరాబేగం,రాజేందర్ భార్య భాగ్యలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇద్దరికి ఆపరేషన్ కోసం సమీరాబేగంనకు రూ.లక్షా 60వేలు, భాగ్యలక్ష్మికి రూ.లక్షా పదివేల ఎల్వోసీ కాపీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆదివారం అందజేశారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్ తదితరులు పాల్గొన్నారు

# దారులన్నీ గుంతలమయం.. ప్రయాణం నరకప్రాయం

నాగిరెడ్డిపేట, జూన్ 16 : మండలంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణమంటేనే మండలవాసులు జంకుతున్నారు. రోడ్డుపై ఎక్కడ చూసినా తారు లేచిపోయి గుంతలు పడి ప్రయాణం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల క్రితం రోడ్లు నిర్మించగా.. ఇప్పటి వరకు వాటికి కనీస మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్ల దుస్థితిని చూసి రోడ్డు పక్కన ఉన్న మట్టి బాటలో ప్రయాణం చేస్తున్నారు. మండలంలోని తాండూర్, కిచ్చన్నపేట, వెంకంపల్లి, మాసన్‌పల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. వదలపర్తి, రాఘవపల్లి, చీనూర్, వాడి, గోలిలింగాల, జప్తిజాన్కంపల్లి, ఆత్మకూర్, బొల్లారం గ్రామాలకు వెళ్లే రోడ్లు తారులేచిపోయి అధ్వానంగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



తాండూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో తేలిన కంకర



జప్తిజాన్కంపల్లి, బొల్లారం రోడ్డుపై పడిన గుంతలు



రాఘవపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పక్కనే ఉన్న మట్టిరోడ్డుపై నుంచి వెళ్తున్న ద్విచక్రవాహనదారులు



చీనూర్, వాడి గ్రామాలకు వెళ్లేరోడ్డు కోతకు గురై ఏర్పడిన గుంతలు

## ఆలయానికి భక్తుల విరాళం అందజేత

మాచారెడ్డి,జూన్ 16 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాం తంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి హైదరాబాద్‌లోని కోకాపేటకు చెందిన గూడ సందీప్‌రెడ్డి-ప్రవీణారెడ్డి దంపతులు రూ.10,116, కామారెడ్డి కి చెందిన పబ్బ మహీరా రూ.5016 విరాళం అందజేశారు.

## 20న అల్బెండజోల్ మాత్రల పంపిణీ

రామారెడ్డి, జూన్ 16: ప్రభుత్వ ఆదేశాల మేరకు 20వ తేదీన మండల వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీని చేపట్టనున్నట్లు ఎంపీడీవో సవితారెడ్డి తెలిపారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఆశ కార్యకర్తలు మాత్రలను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 19 ఏండ్లలోపు వారందరికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలను పంపిణీ చేస్తారని తెలిపారు.



## భక్తిశ్రద్ధలతో దేవీ భాగవతం

మండలంలోని పుల్కల్ గ్రామంలో ఉన్న అన్నపూర్ణ దేవి ఆలయంలో ఐదు రోజులుగా గుండానంద మహారాజ్(పండరీపూర్) ఆధ్వర్యంలో దేవీ భాగవతం కొనసాగుతున్నది. ఆదివారం చివరి రోజు నిర్వహించిన కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, గ్రామపెద్దలు ఉన్నారు.

– బిచ్కుంద, జూన్ 16

# సాగుకు సన్నద్ధం

- సీజన్ ప్రారంభంతో బిజీగా మారిన రైతులు
- విత్తనాలు, ఎరువుల కోసం పరుగులు
- వర్షం కోసం రైతన్న ఎదురుచూపు



దుక్కి దున్నుతున్న రైతు

మద్నూర్, జూన్ 16: వానకాలం ప్రారంభమవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే తమ భూములను దుక్కిదున్ని చదును చేశారు. అవసరమగు విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవడానికి పరుగులు పెడుతున్నారు. మరోవైపు వానల కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం కురియగానే విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. మృగశిర కార్తె ప్రారంభమైనందున ఏ సమయంలోనైనా భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నది. దీంతో రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే స్థానిక వ్యవసాయాధికారులు రైతులకు వానకాలం పంటల సాగుపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లను నిర్వహిస్తూ శాస్త్రవేత్తలు కూడా అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించేలా అధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ దుకాణాలను సైతం తనిఖీ చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరిస్తున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణ యజమాని నుంచి కొనుగోళ్లకు సంబంధించిన రసీదును తప్పకుండా తీసుకొని, పంట చేతికి వచ్చే వరకు భద్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. మండలంలో సుమారు 60శాతం ఎకరాల్లో సోయా పంటను వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వానకాలంలో ప్రధాన పంట సోయా కాగా.. మండలవ్యాప్తంగా సుమారు 27వేల ఎకరాల్లో సాగు చేయనున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆరు వేల ఎకరాల్లో వరి, ఐదు వేల ఎకరాల్లో మినుము, నాలుగు వేల ఎకరాల్లో కంది, నాలుగు వేల ఎకరాల్లో పత్తి, మూడు వేల ఎకరాల్లో పెసర పంటను సాగు చేయనున్నారని తెలిపారు.

### సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు



మండల రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందు కోసం భూములను దుక్కిదున్ని రెడీ చేసుకున్నారు. వర్షం కురియగానే వానకాలం పంట పనులు ప్రారంభమవుతాయి. రైతులకు ఏమైనా సలహాలు కావాలంటే తమను సంప్రదించాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఇప్పటికే ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు ఆదేశాలు జారీ చేశాం.

– రాజు, మండల వ్యవసాయాధికారి, మద్నూర్

# రైతన్న చూపు.. సేంద్రియ ఎరువుల వైపు



పొలంలో జీవాలను కూర్చోబెట్టిన రైతు



ఎరువును తరలించి సాగుకు సిద్ధం చేసిన భూమి

- పెరుగుతున్న రసాయన ఎరువుల ధరలే కారణం
- పేడ, చెరువు పూడికతీత మట్టి పొలాలకు తరలింపు

డోంగ్లీ, జూన్ 16: నేల భూసారం తగ్గడంతో పంట దిగుబడులు నానాటికీ పడిపోతున్నాయి. భూసారం పెంచేందుకు రసాయన ఎరువులు వాడినా తగిన ఫలితం ఉండడం లేదు. దీంతో రైతులు సేంద్రియ ఎరువులను వాడేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రతి సంవత్సరం రసాయన ఎరువుల ధరలు పెరగడం, ఎంత ఖర్చు చేసినా.. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుతున్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువులైన పశువుల పేడతోపాటు చెరువుల్లోని పూడికతీత మట్టిని వేయిస్తున్నారు. గతంలో రైతులు ప్రతి సంవత్సరం ఎండాకాలంలో పశువుల ఎరువును పొలాలకు తరలించేవారు. దానిని చదును చేసి భూమిని సారవంతం చేసేవారు. దీంతో దిగుబడులు కూడా బాగానే ఉండేవి. కానీ క్రమంగా రసాయన ఎరువుల వాడకం పెరిగి, భూసారం తగ్గడం ప్రారంభమైంది. ఎన్ని రకాల రసాయన ఎరువులు వాడినా.. దిగుబడి పెరగడం లేదు. భూసారం పెంపొందించేందుకు రైతులు చెరువు మట్టిని పొలాలకు తరలిస్తున్నారు.

**పూడిక మట్టితో పొలాలు సారవంతం..**

పశువుల పేడ, చెరువుల్లోని పూడిక మట్టిని పొలాల్లోకి తరలించడంతో నేలలు సారవంతంగా మారుతాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ విషయమై రైతులకు గ్రామాల్లో అవగాహన కూడా కల్పిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో రెండేండ్ల వరకు భూమిలో సారం ఉంటుందని, దీంతో దిగుబడులు కూడా బాగా వస్తాయన్నారు. చీడపీడల నుంచి కూడా పంటలు తట్టుకోగలుగుతాయని తెలిపారు. చెరువుల్లోని పూడికతీత మట్టిని పొలాల్లోకి తరలించేందుకు రైతులు పోటీ పడుతున్నారు. పూడిక మట్టిని పొలాల్లో వేయడం వల్ల తేమ శాతం కూడా బాగుంటుందని రైతులు అంటున్నారు.

## నేడు విద్యుత్ 'ప్రజావాణి'

ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట, జూన్16: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ సీఎండీ, కామారెడ్డి సీఈ ఆదేశాల మేరకు సెక్షన్ కార్యాలయల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా సెక్షన్ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సమస్యలపై ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సమీక్షించి వాటిని పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని నాగిరెడ్డిపేట, గాంధారి, ఎల్లారెడ్డి, లింగంపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం బక్రీద్ పండుగ ఉన్నప్పటికీ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

## రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోవద్దు

గాంధారి, జూన్ 17: రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదని మండల వ్యవసాయాధికారి నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ మండలంలో భారీ వర్షాలు కురియలేదని, ప్రస్తుతం అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు, రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదని పేర్కొన్నారు. భూములు పూర్తిగా తడువకపోవడంతో, భూమిలో తేమ శాతం సరిగా లేక, విత్తుకున్న విత్తనాల్లో మొలక శాతం తక్కువగా వస్తుందని తెలిపారు. రెండు మూడు భారీ వర్షాలు కురిసిన అనంతరం భూములు పూర్తిగా తడిసి, సాగుకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. మక్కజొన్న, సోయా, కంది, పత్తి విత్తనాలను విత్తుకోవడానికి కనీసం 65 మిల్లీమీటర్ల వర్షపాతం కురియాలని, అప్పుడే విత్తనాలు మొలకెత్తడానికి భూములు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. తగినంత వర్షం కురియకుంటే విత్తనాల మొలక శాతం తక్కువగా వస్తుందని, రైతులు నష్టపోతారని పేర్కొన్నారు.

## ఎంపీ, ఎంపీపీ మారినా బోర్డుపై.. పేర్లు మారలేదు

**నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా టేకులపల్లి వినీత బాధ్యతలను స్వీకరించారు. ఆమె బాధ్యతలను చేపట్టి రెండు వారాలు గడుస్తున్నా.. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన బోర్డుపై గతంలో ఎంపీపీగా ఉన్న రాజ్‌దాస్ పేరు అలాగే ఉన్నది. జహీరాబాద్ ఎంపీగా సురేశ్ శెట్కార్ గెలుపొందినా.. గత ఎంపీ బీబీ పాటిల్ పేరును కూడా తొలగించలేదు. అధికారులు నిర్లక్ష్యం వీడి.. కొత్త వారి పేర్లు రాయించాలని ప్రజలు కోరుతున్నారు.**

– నాగిరెడ్డిపేట, జూన్ 16



## పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపై పడిన చెట్టు

**మేనూర్ నుంచి డోంగ్లీ వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై చెట్టు నేలకొరిగింది. దాని ముళ్లు దారిపై వెళ్తున్న వారికి ఇబ్బందిని కలిగిస్తున్నాయి. రాత్రి సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి కంపను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.**

– డోంగ్లీ, జూన్ 16

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

నిజాంసాగర్/ మాచారెడ్డి, జూన్ 16: నిజాంసాగర్ మండలంలోని నడిమి తండాకు చెందిన కడావత్ రమేశ్, ఆరేడు గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ తమ మొబైల్ ఫోన్లను ఆరు నెలల క్రితం పోగొట్టుకున్నారు. పూర్తి వివరాలతో నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనుగొన్నారు. ఎస్సై సుధాకర్ వాటిని బాధితులకు ఆదివారం అందజేశారు. మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన మినుకూరి నర్సింహారెడ్డి తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధితుడికి ఫోన్‌ను ఆదివారం అందజేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వారు వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై సుధాకర్

## ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు

లింగంపేట, జూన్ 16: లింగంపేటలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిములు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసరాలు శుభ్రం చేయించి, తగు వసతులు కల్పించామని ఆయన తెలిపారు.

## డ్రైనేజీలు శుభ్రం చేయించండి



పోస్టాఫీసు వద్ద మట్టితో పూడుకుపోయిన డ్రైనేజీ

లింగంపేట, జూన్16: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మురికి కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో నీరంతా రహదారిపై ప్రవహిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తేలికపాటి వర్షాలు కురిసిన సమయంలో వరద రహదారులపై ప్రవహిస్తున్నదని తెలిపారు. మురికి నీటితో దోమల బెడద పెరిగిందన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని తొలగించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డి, జూన్16: మండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామానికి చెందిన సిద్ధవ్వ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఐదు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధవ్వ కాలు విరిగి పోవడంతో ఇంట్లోనే ఉంటున్నది. కాలు నొప్పి అధికం కావడంతో నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సిద్ధవ్వ భర్త కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## యువతి అదృశ్యం



రజిత

ఎల్లారెడ్డి, జూన్16: మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన గులపల్లి రజిత అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. రజిత శనివారం కూలీ పనికి అని చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుం బ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో ఆమె తండ్రి కిషన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశా డు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**బాన్సువాడ మండలం తిర్మాలాపూర్‌లో ఒకరు..**

బాన్సువాడ, జూన్ 16: బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కుకుట్ల రాములు (40) అదృశ్యమైనట్లు సీఐ కృష్ణ ఆదివారం తెలిపారు. మద్యానికి బానిసైన రాములు ఈ నెల 4న పనికోసం హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లా డు. అప్పటి నుంచి రాములు ఆచూకీ లభించకపోవడంతో ఆయ న భార్య మంజుల ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.